క్లుప్తంగా

ఘనంగా రావులమ్మ వార్షికోత్సవం



రావులమ్మ అమ్మవారు

అంబాజీపేట: గంగలకుర్రు గ్రామంలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఏకాహం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత శ్రీనివాస్ దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి గొల్లప్రోలుకు చెందిన శ్రీనివాస్-పద్మావతి దంపతులు బుధవారం రూ.10,116 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.10 వేలు సాయంగా అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంత్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన కడలి శ్రీలక్ష్మివెంకటరెడ్డి ఆరేళ్లుగా రెండు కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటున్నారు. కిడ్నీ మార్చుకోవాలని డాక్టర్లు చెప్పారు. వైద్యం చేయించుకునే స్తోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.10 వేల చెక్కు అందజేశారు.

రేపు మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాక



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాజోలు: ఈ నెల 27 శుక్రవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి జిల్లాలో పర్యటించనున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నూటికుర్తి సత్యనారాయణ తెలిపారు. బుధవారం రాజోలు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 27 మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి ఆధ్వర్యంలో శివకోడు కాపు కల్యాణ మండపంలో సమావేశం జరుగుతుందన్నారు. రాజోలు నియోజకవర్గం నుంచి అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు శెట్టెం శ్రీనివాస్, మంద సాయిబాబు, లంక సురేష్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, బొంతు సుధాకర్, నామవరపు చిన సత్యనారాయణ, కంపాల రమేష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

అలమూరు: మండలంలోని పెదపళ్లలో సుమారు రూ.33 లక్షలతో నిర్మించనున్న 60 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకుకు బుధవారం భూమి పూజ జరిగింది. స్థానిక పీహెచ్‌సీ సమీపాన వాటర్‌ట్యాంకుల సముదాయంలో అదనంగా నిర్మించనున్న ఈ వాటర్ ట్యాంకును సర్పంచ్ యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల, చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు తదితరులు భూమి పూజ చేశారు. మాజీ సర్పంచ్ గారపాటి త్రిమూర్తులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, జాస్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణమంటే హడల్



అధ్వానస్థితిలో అప్పనపల్లి-పెదపట్నంలంక రోడ్డు

- ఆ రోడ్డులో వెళ్లాలంటే వెనకడుగు
- కార్యక్రమం సరే.. కార్యాచరణ ఏదీ?
- కనీసం గుంతలైనా పూడ్చలేదంటూ ప్రయాణికుల ఆవేదన

మామిడికుదురు: గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం అంటూ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని తీర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంక్రాంతి పండగకు వచ్చే వారు ఎక్కడా రోడ్డు బాగోలేదని వీడియోలు పెడితే దానికి ఎమ్మెల్యేలను బాధ్యులను చేస్తామంటూ సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. కానీ దానికి తగిన విధంగా క్షేత్రస్థాయిలో మాత్రం కార్యాచరణ చేపట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పనపల్లి నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోతున్నారు. బాబోయ్ ఆ గ్రామానికి రావాలా అంటూ ఆటో వాలాలు కూడా భయపడిపోతున్నారంటే ఆ రోడ్డు పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వానికి ఈ మూడు గ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆ విశ్వాసంతో అయినా మూడు గ్రామాలకు రాకపోకలు సాగించే రోడ్డును ఆధునీకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ స్వయంగా కూటమి నేతల నుంచే వస్తోంది.

ఆరు కిలోమీటర్లు నరకప్రాయం

పాశర్లపూడి నుంచి వయా అప్పనపల్లి, బి.దొడ్డవరం మీదుగా పెదపట్నంలంక వరకు రోడ్డు పొడవు 8.8 కిలోమీటర్లు. ఈ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో సీఆర్ఎఫ్ నిధులు రూ.14.50 కోట్లు మంజూరు చేశారు. రెండేళ్ల క్రితం ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 2.70 కిలోమీటర్ల మేర సిమెంట్ కాంక్రీట్ రోడ్డును నిర్మించారు. ఇక 6.10 కిలోమీటర్ల రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇందులో 7.5 మీటర్ల వెడల్పు, 60 మీటర్ల పొడవుతో కాజ్‌వేను ఆధునీకరించాల్సి ఉంది. ఈ పనులతో పాటు పూర్తిగా పాడైపోయిన రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ నిధులు ప్రధాన సమస్యగా మారాయని అధికారులు చెబుతున్నారు. ఈ నిధులను సత్వరం విడుదల చేసి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని మూడు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కనీసం గుంతలైనా పూడ్చండి, మీరు చెప్పిన గుంతల రహిత రోడ్డుగా అభివృద్ధి చేయండని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డును తక్షణం అభివృద్ధి చేయాలి



అప్పనపల్లి నుంచి పెదపట్నంలంక వరకు ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డును తక్షణం అభివృద్ధి చేయాలి. రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ రోడ్డు దుస్థితిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించాల్సి ఉంది. ప్రభుత్వం చెప్పిన విధంగా గుంతల రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి.

– గెద్దం ఏసుదాను, పెదపట్నంలంక

రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది



పాశర్లపూడి ఏటిగట్టు దిగువ నుంచి రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఈ మార్గంలో బి.దొడ్డవరం వెళ్లాలంటే భయమేస్తుంది. ఏటిగట్టు దిగువన కాజ్‌వే పూర్తిగా పాడైపోయింది. గోదావరి వరదల సమయంలో దీనిపై రాకపోకలు నిలిపి వేస్తున్నారు. చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రోడ్డు గురించి చెప్పాలంటే చాలా దారుణంగా ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డును అభివృద్ధి చేసి లంక గ్రామాల ప్రజలకు అండగా నిలవాలని కోరుకుంటున్నాం.

– పసుపులేటి గణపతి, బి.దొడ్డవరం

జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికైన ధర్మాజీ



పోటీలకు ఎంపికైన ధర్మాజీని అభినందిస్తున్న ఎంపీడీఓ రాజు

అలమూరు: మండలంలోని పినపళ్ల, సంధిపూడి గ్రామ సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొంకిపూడి ధర్మాజీ జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. గత నవంబర్ నెల ఏడున విజయవాడలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ఎంపిక ప్రక్రియలో ధర్మాజీ పాల్గొని తన ప్రతిభను చాటాడు. దీంతో వచ్చే ఏడాది జనవరి 03 నుంచి 08 వరకూ దేశ రాజధాని ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో ఆంధ్ర తరఫున ఎంపికైనట్లు ఉత్తర్వులు వెలువడినట్లు క్రీడాకారుడు ధర్మాజీ బుధవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడ్ని ఎంపీడీఓ ఎ.రాజు, మండల ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు, ఎంపీపీఏఓ ఎం.మెహెర్ ప్రకాష్, మండల ఇంజినీరింగ్ సమాఖ్య అభినందనలు తెలియజేసింది.

పోరుబాట విజయవంతం చేయాలి



పి.గన్నవరంలో విద్యుత్ చార్జీలపై పోరుబాట పోస్టర్లను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

- జెడ్పీ చైర్మన్ విప్పర్తి
- పి.గన్నవరంలో పోస్టర్ విడుదల

పి.గన్నవరం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు పి.గన్నవరంలో నియోజకవర్గ స్థాయిలో జరుగునున్న 'విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికలకు ముందు.. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పారని గుర్తు చేశారు. దానిని విస్మరించి అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు తిరగకుండానే విద్యుత్ వినియోగదారుల నెత్తిన రూ.15,485 కోట్ల మేర చార్జీల భారం వేశారని విమర్శించారు. నిరసన కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని విప్పర్తి విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర నాయకుడు నేలపూడి స్టాలిన్‌బాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు గన్నవరపు శ్రీనివాస్, బూడిద వరలక్ష్మిలు మాట్లాడుతూ రైతులకు, ఎస్సీలకు ఉచిత విద్యుత్ విషయంలో కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టేందుకు కార్యాచరణ చేస్తుందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, కుడుపూడి విద్యాసాగర్, విత్తనాల ఇంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు, మద్దుల వరలక్ష్మి, కుంపట్ల గోపి, కొర్లపాటి కోటబాబు, సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతి గర్వించదగ్గ ప్రధాని వాజ్‌పేయి

- నివాళులర్పించిన నేతలు
- పాల్గొన్న కార్యకర్తలు

కొత్తపేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలు బుధవారం కొత్తపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బోడిపాలెం వంతెన సమీపాన జిల్లా బీజేపీ నాయకుడు సంపతి కనకేశ్వరరావు స్వగృహం వద్ద ఆయన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పాలూరి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలూరి మాట్లాడుతూ రాజకీయ భీష్మపితామహ, జాతి గర్వించదగ్గ ప్రధాని వాజ్‌పేయి అని అన్నారు. కార్గిల్ యుద్ధవిజేత, నేషనల్ హైవేల ప్రదాత, మహిళల అభివృద్ధి కోసం మహిళా సంఘాల సృష్టికర్త, గ్రామీణుల ఆరోగ్యం కొరకు ఆశావర్కర్లు, గ్రామపంచాయతీల పురోభివృద్ధికి వాజ్‌పేయి కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2015లో భారతరత్న అవార్డు ప్రదానం చేసి గౌరవించిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి, తొగరు ఆంజనేయులు, మండల, జిల్లా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వాజ్‌పేయి జయంతిని బుధవారం పి.గన్నవరంలో నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి డాక్టర్ చందన పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



పి.గన్నవరంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



సఖినేటిపల్లిలో మిఠాయిలు పంచుతున్న బీజేపీ శ్రేణులు

స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పార్టీ నాయకులు పాలు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి గోపాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, హెచ్ఎన్ కుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: జటిల సమస్యలను సైతం ఓర్పుగా పరిష్కరించే మంచి సుపరిపాలనా దురంధరుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. బుధవారం సఖినేటిపల్లి సెంటర్లో వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని మహనీయుడికి పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు నాయకులు మిఠాయిలు పంచారు. రాష్ట్ర డ్రైయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, మండల ప్రధాన కార్యదర్శి కొంతం శ్రీనివాసరావు, నాయకులు అల్లూరి సత్యనారాయణ రాజు, బోణం నాయుడు, నంబూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నేత పాలూరి తదితరులు

మలికిపురంలో..

మలికిపురం: మండల బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మలికిపురంలో పార్టీ నాయకుడు ఇందుకూరి అచ్యుతరామరాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాపిశెట్టి కనకేశ్వరరావు అధ్యక్షతన మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను వక్తలు కొనియాడారు. నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, నాయకులు మేడిచర్ల చాణక్య, రమేష్ రాజు, కట్టా వాసు, బాలాజీ గణేష్, ఆరేటి రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు

- క్రీస్తు ఆరాధన దినం క్రిస్మస్
- ఆనందోత్సాహాలతో వేడుకలు
- ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్న క్రైస్తవులు

మలికిపురం: ప్రపంచ శాంతి దూత ఏసుక్రీస్తు అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. సూర్యారావు మాట్లాడుతూ ప్రపంచానికి ఏసు క్రీస్తు బోధనలు శాంతి మార్గంలో నడిపిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని భావించిన క్రీస్తు దేవుడయ్యారని పేర్కొన్నారు. ఏసు ప్రకటనలు ఎంతో మంది జీవితాలలో సంతోషం నింపాయని అన్నారు. పాస్టర్లు రవి, సాల్మన్, పీటర్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. పాస్టర్స్ కొండా ధర్మారావు, వి.శామ్యూల్, ఎంపీటీసీలు నల్లి రత్నకుమార్, చెల్లింగి ఈశ్వరి, నాయకులు కుసుమ చంద్రశేఖర్, ఈద రవిరెడ్డి, ఎస్తేర్ రాణి, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: సమస్త మానవాళికి శుభాన్ని కలగజేసే పండగ క్రిస్మస్ అని పలువురు చర్చి పాస్టర్లు తెలిపారు. బుధవారం మండలంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను పాస్టర్లు నిర్వహించారు. ఆయా చర్చిల్లో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అంతర్వేది దేవస్థానం గ్రామంలోని చర్చిలో సమైక్య యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. సఖినేటిపల్లి సెంటినరీ ఏపీఫానియా లూథరన్ దేవాలయం, మూడుతాములు శాంతినగర్ తదితర చర్చిల్లో ఉదయం నుంచి ప్రార్థనలు చేశారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన క్రీస్తు బోధనలు సమస్త మానవాళికి ఆచరణీయమని పాస్టర్లు పేర్కొన్నారు. అలాగే అప్పనరామునిలంక క్రీస్తు కల్వరి మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బైబిల్ క్విజ్ నిర్వహించి విజేతలకు ప్రముఖులతో బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు, ఏసుక్రీస్తు జన్మించిన పసువుల పాకల సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. పలు చర్చిల్లో అన్నదానాలు, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పిల్లలు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ క్రిస్మస్‌ను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. శాంతికి, సమానత్వానికి గుర్తుగా బాలఏసుకు కొవ్వొత్తులతో ప్రార్థన చేశారు. మగటపల్లి సీయోను ప్రార్థనా మందిరంలో రెవరెండ్ ఉండ్రు మోహనరావు, ఉండ్రు మోజెస్‌లు మాట్లాడుతూ క్రీస్తు సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు.



మలికిపురం క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



అయినవిల్లిలంకలో క్రిస్మస్ వేడుకల్లో భాగం చర్చికి ఏర్పాటు చేసిన దీపాలంకరణ

అంబాజీపేటలో..

అంబాజీపేట: క్రిస్మస్ సందర్భంగా అంబాజీపేట హడ్కో కాలనీలోని కల్వరి క్రిస్టియన్ ప్రేయర్ హౌస్, చిల్డ్రన్స్ హోమ్‌లో బిషప్ జల్లి జార్జిపాపఫ్, డాక్టర్ జల్లి విక్టర్ కుమార్‌ల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గిఫ్ట్ ఆఫ్ లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ నిర్వాహకులు దార్ల ఏస్తేరురాణి ఆధ్వర్యంలో గంగలకుర్రు, మొసలపల్లి గ్రామాల్లోని మన్నా చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ నిర్వహించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: క్రిస్మస్ సందర్భంగా బెల్లంపూడిలో సెయింట్ మాథ్యూస్ లూథరన్ చర్చిలో రెవరెండ్ ఎం.ఉదయ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన క్రీస్తు సందేశాన్ని వినిపించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు. నాగుల్లంక శివారు పెదకందాలపాలెం ఎస్‌జేఎం ప్రార్థనా మందిరంలో రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో చిన్న పిల్లల క్రిస్మస్ ఘనంగా జరిగింది. చిన్నారులు ఏసు క్రీస్తు పాటలతో అలరించారు. ఈసందర్భంగా దానియేలు క్రీస్తు సందేశాన్ని వినిపించి, పిల్లలందరికీ బహుమతులు అందజేశారు. సంఘ కార్యదర్శి యు.జాన్‌బాబు, వందలాది మంది చిన్నారులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా గడిపారు. చర్చిల్లో పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు ఆధ్వర్యంలో భక్తులు క్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కొత్తపేటలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు ఇంట క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు అభిమానులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు ప్రత్యేకంగా ఆయనతో కేక్‌లు కట్ చేయించారు.

అలమూరులో..

అలమూరు: క్రిస్మస్ పురస్కరించుకుని బుధవారం చర్చిల్లో అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయి. వాడవాడలా ఉన్న క్రైస్తవ చర్చిలు హల్లెలూయ స్తోత్రాలతో మార్మోగగా క్రీస్తు బోధనలు, కీర్తనలతో సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని క్రైస్తవ చర్చిల మత ప్రబోధకుడు విద్యుద్దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రైస్తవులంతా గ్రామాల్లోని ప్రార్థనాలయాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రైవేటు సంస్థలు, ఉద్యోగులు, విద్యార్థులు ఘనంగా ఈ క్రిస్మస్ వేడుకలను జరుపుకొన్నారు. మడికిలోని ఫైర్ ఆఫ్ రివైవల్ ప్రేయర్ చర్చి ఆవరణలో జాతీయ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రతినిధి యు.సుందరం విజయం ఆధ్వర్యంలోను, ఆలమూరులోని హోలీ పరిశుద్ధ ఆలయంలో పాస్టర్ జీజే సుధాకర్ ఆధ్వర్యంలోను క్రీస్తు బోధనలు వినిపించారు. నిస్సహాయులపై ప్రతి ఒక్కరూ ప్రేమ, కరుణ చూపించాలని క్రీస్తు నోట నుంచి వెలువడిన ప్రవచనాలే మానవాళికి మోక్షాన్ని కలుగజేయునని పలువురు ప్రముఖ మత ప్రబోధకులు అన్నారు. ప్రార్థనాలయాల్లో భక్తులు కొవ్వొత్తులు వెలిగించి తమ జీవితాల్లో కూడా వెలుగులు నింపాలని ప్రార్థించారు. పలువురు క్రైస్తవులు క్రిస్మస్ పురస్కరించుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్‌ను వేడుకగా నిర్వహించారు. తొత్తరమూడిలోని పాస్టర్ ఎ.యోషువా ఆధ్వర్యంలో క్రిస్మస్ జరిపారు. కేకు కట్ చేసి క్రీస్తు జన్మదిన వేడుకలు జరిపారు. ఏసు దీవెనలు జనులందరికీ ఉండాలని ప్రార్థనలు చేశారు.



అంబాజీపేటలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



మగటపల్లి సీయోను ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



పెదకందాలపాలెం చర్చిలో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న చిన్నారులు



కొత్తపేటలో క్రిస్మస్ ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



కొత్తూరు బాప్టిస్ట్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మత ప్రబోధకుడు